క్లుప్తంగా

వేమా నరసింహారావుకు ఘననివాళి



కంచికచర్ల: కంచికచర్ల మాజీ సర్పంచి వేమా నరసింహారావు 94వ జయంతిని మంగళవార ఘనంగా నిర్వహించారు. నెహ్రూ బొమ్మ సెంటర్‌లోని నరసింహారావు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంచికచర్ల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. వేమా నరసింహారావుకు నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్ష్యుడు వేమా సురేష్‌బాబు, సీనియర్ జర్నలిస్టు గంగిరెడ్డి రంగారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వేమా శివకోటి, దేవిరెడ్డి శ్రీనివాసరావు, మంగినేని వెంకట్రామయ్య, మండల చంటి, బొక్కిసం నాగభూషణం, వేమన నరసింహారావు, సూదుల నారాయణ, చాప సత్యనారాయణ, పొన్నపూల శ్రీనివాసరావు, బచ్చు వెంకటేశ్వరరావు, దాదే బుచ్చిబాబు, మంగినేని బుడ్డియ్య, దేవిరెడ్డి లక్ష్మీనారాయణ, ఆకుల రామారావు ఉన్నారు.

ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్‌పై కేసు నమోదు

కంచికచర్ల: ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌పై కంచికచర్ల పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారు. ఈనెల 13న కంచికచర్ల ఓసీ క్లబ్ ఫంక్షన్ హాలులో జరిగిన 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ' అనే కార్యక్రమంలో కూటమి కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసేలా ఎమ్మెల్యే అరుణకుమార్ వ్యాఖ్యానించారంటూ టీడీపీ మండల అధ్యక్షుడు కోగంటి వెంకటసత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బీ రాజు మంగళవారం తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

శాకంబరీదేవిగా భద్రకాళి అమ్మవారు



నందిగామరూరల్: మండలంలోని గోళ్లమూడి గ్రామంలో వేంచేసియున్న భద్రకాళి అమ్మవారికి గ్రామస్తుల సహకారంతో ఆషాడమాసం సందర్భంగా పలు రకాల కూరగాయలు, పండ్లతో మంగళవారం శాకంబరీదేవిగా అలంకరించారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల నడుమ గ్రామంలోని ముత్యాలమ్మ, గంటాలమ్మ, సీతమ్మ అమ్మవారి ఆలయాలలో సారె సమర్పించారు. సారె తీసుకువస్తున్న మహిళలకు గ్రామస్తులు జలబిందెలతో వారు పోసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

డ్రైనేజీ లేక అగచాట్లు

కంచికచర్ల : మండలంలోని పేరకలపాడు ఎస్సీ కాలనీలో డ్రైయినేజీ సదుపాయం లేకపోవడంతో మురుగు నీరు ఎక్కడికక్కడే నిలుస్తోంది. దీంతో కాలనీవాసులు ఇబ్బందిపడుతున్నారు. మురుగు కారణంగా దోమలు వృద్ధిచెందుతున్నాయని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాలనీల్లో డ్రైనేజీ సదుపాయం కల్పించకుండానే సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టడంతో ఇబ్బందిపడుతున్నట్లు కాలనీ మహిళలు చెబుతున్నారు. ఇకనైనా పంచాయతీ పాలకులు స్పందించి ఎస్సీకాలనీలో మురుగునీటి పారుదలకు డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరారు.

వాహనాల తనిఖీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): వాహనదారులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే తగిన చర్యలు తీసుకుంటామని చిల్లకల్లు ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ హెచ్చరించారు. చిల్లకల్లు గ్రామ ప్రధాన సెంటరులో మంగళవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. రాత్రి సమయాలలో తిరిగే ఆటోవాలాలు కొత్త వ్యక్తులు తిరుగుతున్నట్లు అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

చర్లపల్లి - తిరుపతి ప్రత్యేక రైలు పొడిగింపు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వారంలో రెండు రోజులు చర్లపల్లి – తిరుపతి మధ్య నడిచే ప్రత్యేక రైళ్లను 2026 మార్చి వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. చర్లపల్లి – తిరుపతి(07017) ఆగస్టు 31 నుంచి వచ్చే ఏడాది మార్చి 29 వరకు ప్రతి ఆదివారం, తిరుపతి – చర్లపల్లి ప్రత్యేక రైలు (07018) సెప్టెంబర్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 30 వరకు ప్రతి సోమవారం నడుస్తోంది. అదే విధంగా చర్లపల్లి – తిరుపతి(07251) సెప్టెంబర్ 3 నుంచి వచ్చే ఏడాది మార్చి 25 వరకు ప్రతి బుధవారం, తిరుపతి – చర్లపల్లి(07252) సెప్టెంబర్ 4 నుంచి వచ్చే ఏడాది మార్చి 26 వరకు ప్రతి గురువారం నడపనున్నారు.

ఆలయంలో నూతన నిర్మాణాలకు ప్రతిపాదనలు

- రూ.4కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయం
- ఈ మేరకు ప్రతిపాదనల తయారీ



పరిపాలనా భవనం, అన్నదాన కేంద్రం ఏర్పాటు చేసే ప్రాంతం

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం నూతన నిర్మాణాలకు ఆలయ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సుమారుగా రూ.4 కోట్ల వ్యయంతో ఆలయ పరిపాలనా భవనం, లడ్డు పోటు, అన్నదాన తయారీ కేంద్రంతోపాటు మురుకు నీటిశుద్ధి జల కేంద్రం ఏర్పాటుకు సంబంధించి ఆలయ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటికి సంబంధించి దేవాదాయ శాఖ చీఫ్ ఇంజినీర్ శేఖర్‌బాబు సారథ్యంలో బృందం ఇటీవల నిర్మాణాలకు అవసరమైన స్థల పరిశీలన చేసింది. గతంతో పోలిస్తే అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఏటా సగటున 50 లక్షలకు పైగా భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుండగా, అందుకనుగుణంగా వసతులు అందుబాటులో లేకపోతుండటంతో భక్తులు ఇబ్బందిపడుతున్నారు.

బేడా మండపంలోనే ..

ప్రస్తుతం అన్నదానం, లడ్డూ పోటు బేడామండపంలోనే నిర్వహిస్తుండటంతో ఇక్కడి గోడలు, శ్లాబ్, ఫ్లోరింగ్ దెబ్బతింటోంది. అన్నదానం రోజుకు 50మంది నుంచి 250వరకు పెరిగింది. ఇందు కోసం ఆలయానికి ఉత్తరం వైపున నూతనంగా ఏర్పాటు చేయటానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం రోజుకు 10 వేల లడ్డూలు, పులిహోర ప్రసాదాలు తయారు చేస్తున్నారు. బేడామండపం ఇరుకుగా ఉండటంతో గతంలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో ఆలయానికి ఆగ్నేయం వైపున లడ్డూపోటు ఏర్పాటుకు ప్రతిపాదించారు.



శ్రీతిరుపతమ్మవారి ఆలయం

శిథిలావస్థలో సత్రాలు..

ప్రస్తుతం ఆలయ పరిపాలనాభవనాన్ని ఆలయానికి దూరంగా అమ్మవారి సత్రాల్లో నిర్వహిస్తున్నారు. ఆసత్రాలు కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడే ఏప్రమాదం జరుగుతుందో అని అధికారులు, సిబ్బంది భయపడుతున్నారు. పరిపాలనా భవనాన్ని నూతనంగా నిర్మించిన డార్మెటరీ లేక కేశఖండనశాల భవనంపై నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటితో పాటు డార్మెటరీ, కేశఖండన శాలలో వినియోగించిన మురుగు నీటిని శుద్ధి చేసి మొక్కలకు, ఫ్లోరింగ్ శుభ్రపరిచేందుకు వినియోగించేలా ఓ మురుగు నీటిశుద్ధ జల ప్లాంట్‌కు అవసరమైన ప్రతిపాదనలు ఆలయ ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేశారు.

ప్రతిపాదనలు సిద్ధం..



ఆలయ అభివృద్ధిలో భాగంగా పరిపాలన భవనం, లడ్డూపోటు, అన్నదాన భవనాల కోసం ప్రతిపాదనలు తయారుచేసి పంపించాం. దేవాదాయ శాఖ చీఫ్ ఇంజినీరింగ్ అధికారుల బృందం ఆలయం వద్ద చేపట్టనున్న పనులకు సంబంధించి ఆయా స్థలాలను పరిశీలించింది. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ప్రాధాన్యక్రమంలో ఆయా పనులు చేపడతాం.

– బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్, ఆలయ ఈఓ

ప్రశ్నించడం ప్రతిపక్ష పార్టీగా మా బాధ్యత

ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్



నందిగామ టౌన్: కూటమి ప్రభుత్వంలో విస్మరించిన హామీలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఏడాది కాలంగా సాగుతున్న అరాచకాలపై మాట్లాడితే తనపై అక్రమకేసులు బనాయిస్తారా? అని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ మంగళవారం ప్రశ్నించారు. కంచికచర్ల ఓసీ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో రప్పారప్పా అని సినిమా డైలాగ్ చెబితే రప్పా రప్పా నరుకుతామని మాట్లాడినట్లు అసత్య ప్రచారాలు చేయడం తగదన్నారు. రప్పా రప్పా అంటేనే కేసులు పెట్టిస్తున్న కూటమి నేతలు.. మా నాయకులు కనుసైగ చేస్తే మాజీ ఎమ్మెల్యే జగన్ మోహనరావు, ఎమ్మెల్సీనైనా ఇంటికెళ్లి నరుకుతామంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ద్వంద ప్రమాణాలు తగవు..

శాసనమండలి సభ్యునిగా, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా కూటమి ప్రభుత్వ అన్యాయాలు, అక్రమాలు, అరాచకాలతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రజల పక్షాన ప్రశ్నించాల్సిన బాధ్యత తమపై ఉందని అరుణకుమార్ తెలిపారు. ప్రతిపక్ష నాయకులు ఏమైనా మాట్లాడొచ్చు.. ఏ విమర్శలైనా చేయొచ్చు.. ప్రతిపక్షాలు చేసే విమర్శలను నిరూపించుకోవాల్సిన బాధ్యత అధికార పక్షంపై ఉందంటూ ప్రస్తుత శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య గతంలో చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తు చేశారు. అధికారంలో ఉంటే ఒకలా..ప్రతిపక్షంలో ఉంటే మరోలా ద్వంద ప్రమాణాలు తగవన్నారు. ప్రతిపక్షాలు విమర్శలు చేస్తే సహించలేక కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం కూటమి నేతల నైజానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.మట్టి, ఇసుక, గ్రావెల్‌తో పాటు గంజాయి తదితర అక్రమ వ్యాపారాలతో కోట్లు కొల్లగొడుతున్నారని మండిపడ్డారు.

అవినీతి సంపాదనే లక్ష్యంగా పాలన..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే ఎమ్మెల్యేతోపాటు నియోజకవర్గ కూటమి నేతలు కొండలు, గుట్టలు, చెరువులను లూటీ చేస్తూ అవినీతి సంపాదనే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని అరుణకుమార్ విమర్శించారు. రాఘవాపురం గట్టు నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వుతుండగా కొండ చరియలు విరిగిపడి ఓ వ్యక్తి మృతి చెందితే బాధిత కుటుంబానికి అండగా ఉండాల్సిందిపోయి గుట్టుచప్పుడు కాకుండా తప్పును కప్పిపుచ్చారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలు, రోడ్ల నిర్మాణ పనులకు గ్రావెల్ తోలుతుంటే అర్ధరాత్రుళ్లు గట్టు వద్ద నిద్రాహారాలు మాని జాగరం చేసిన ఎమ్మెల్యే, నేడు కాసుల కోసం అదే కొండను పిండి చేస్తున్నారని ఆరోపించారు.

గ్రామగ్రామాన బెల్టుషాపులు..

గ్రామాల్లో తాగునీటి సరఫరా సంగతెలా ఉన్నా.. ప్రతిగ్రామంలో రెండు, మూడు బెల్టుషాపులు ఏర్పాటు చేసి మద్యానికి ఏమాత్రం లోటులేకుండా పాలన సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. చందర్లపాడు మండలంలో అధికార పార్టీ వేధింపులు తట్టుకోలేక మాఅక్క (ఎమ్మెల్యే) ఉన్నారు.. నాకు న్యాయం జరుగుతుంది.. అని సెల్ఫీ వీడియో తీసుకుని మరీ ఓఫీల్డుఅసిస్టెంట్ ఆత్మహత్యకు పాల్పడితే బాధితురాలి నమ్మకాన్ని సైతం అమ్మకానికి పెట్టి నిందితునికి అండగా నిలిచారని ఆరోపించారు. ఈ ఏడాది కాలంలో వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు 30మందిపై రౌడీషీట్‌లు, 100 మందికి పైగా అక్రమ కేసులు బనాయించిన ఘనత ఎమ్మెల్యే సౌమ్యకే దక్కిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, మునుపెన్నడూ లేని విధంగా న్యాయవాదులు, జర్నలిస్టులపై సైతం కేసులు పెడుతూ పాలనకు సరికొత్త అర్థం చెబుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా బాధ్యతయుతమైన ప్రభుత్వ విప్‌గా, ఎమ్మెల్యేగా సౌమ్య.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా డమ్మీ ఎమ్మెల్యేగా ఉండొద్దని నియోజకవర్గ ప్రజలు ఆకాంక్షిస్తున్నారని సూచించారు.

మాదకద్రవ్యాలతో అనేక అనర్థాలు : ఎస్‌ఐ

నందిగామరూరల్: విద్యా సంస్థల్లో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ అభిమన్యు హెచ్చరించారు. సబ్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాల విద్యార్థులకు మహిళల భద్రత, శక్తి యాప్ వాడకం, మాదకద్రవ్యాల దుష్ప్రభావం, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌తో జరిగే నష్టం తదితర సమస్యలపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అత్యవసర సమయంలో 112, శక్తి యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందిస్తే సత్వర సహాయం అందుతుందన్నారు. విద్యాసంస్థలు, రద్దీ ప్రాంతాలు, మద్యం దుకాణాల వద్ద కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమానిత వ్యక్తుల తనిఖీలు, యువతకు భద్రత కల్పించడంలో ఈగల్ టీం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని వివరించారు. విద్యార్థులు ర్యాగింగ్, మాదకద్రవ్యాల సేవనానికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అభిమన్యు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

విక్రయాలు నిలిపివేత

నందిగామటౌన్: పట్టణంలోని పలు పురుగుమందులు, ఎరువులు, విత్తన దుకాణాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాష్ట్రస్థాయి బృందం మంగళవారం తనిఖీ నిర్వహించింది. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దుకాణదారులు విధిగా స్టాకు రిజిస్టర్‌లో ఆయా వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలన్నారు. దుకాణాల ఎదుట విధిగి డిస్‌ప్లే బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. తొలుత స్థానిక వెంకట సాయి సీడ్స్‌ను దుకాణాన్ని తనిఖీ చేసి షాపులో సరైన అనుమతులు లేనందున రూ. 8.37 లక్షల విలువ చేసే 31.5 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలను నిలిపివేయాలని ఆదేశించారు. అనంతరం బాలాజీ మిత్ర సీడ్స్‌లో పురుగు మందుల స్టాకు రిజిష్టర్, డిస్‌ప్లే బోర్డు లేకపోవడంతో రూ. 63.62 లక్షల విలువ చేసే 3,747 లీటర్లు/కేజీల విక్రయాలను నిలుపుదల చేయాలని ఆదేశించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.తనిఖీల్లో వ్యవసాయ శాఖ స్క్వాడ్ టీం ఏడీఏ హనుమంతరావు, ఏడీఏ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, సిబ్బంది వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగ కమిటీ నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర ఎస్సీ విభాగ కమిటీలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన పలువురిని నియమించారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ విభాగ కమిటీ కార్యదర్శులుగా కామళ్ల కోటేశ్వరరావు (విజయవాడ వెస్ట్), దర్శనాల వెంకట రమణ (జగ్గయ్యపేట), కోట దాసు (తిరువూరు), తానంకి రాంబాబు (తిరువూరు) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఏడాది పాలనపై ఇంటింటికీ ప్రచారం

నందిగామరూరల్: చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏడాదిగా సుపరిపాలన సాగిస్తోందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని తొర్రగుడిపాడు గ్రామంలో మంగళవారం ఆయన సుపరిపాలన–తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఏడాది పాలనా తీరును ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమితోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చెరుకూరు హైమారావు, సాంబశివరావు, నాగమల్లేశ్వరరావు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహాసభను జయప్రదం చేయండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్ ఆధ్వర్యంలో ఈ నెల 17వతేదీ శుక్రవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న జాతీయ బీసీ మహాసభను జయప్రదం చేయాలని ఆసంఘం ఎన్టీఆర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బుద్ధా దివాకర్ కోరారు. తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆవరణలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మంగళవారం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్ధా దివాకర్ మాట్లాడుతూ చట్ట సభలు, విద్య, ఉద్యోగ రంగాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, శాస్త్రీయబద్ధంగా లేని ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలన్నారు. మండల కమిషన్ సిఫారసులను పూర్తి స్థాయిలో అమలు చేయాలని వంటి డిమాండ్ల సాధన కోసం జరిగే మహాసభకు బీసీలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షులు శీరం నాగమల్లేశ్వరరావు, జిల్లా యూత్ అధ్యక్షులు దాసరి రామకృష్ణ, మహిళా అధ్యక్షురాలు బత్తుల గీత, వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ మల్లికార్జునరావు, విజయవాడ నియోజకవర్గ అధ్యక్షులు దార్న చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలు

జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ పూర్ణిమ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా అపారమైన ఉపాధి అవకాశాలను సొంతం చేసుకోవచ్చునని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ అన్నారు. ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం సందర్భంగా స్థానిక రావిచెట్టు సెంటర్‌లో ఉన్న జనశిక్షణ సంస్థాన్ కార్యాలయం ఆవరణలో మంగళవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోనూ నైపుణ్యాలు ఉంటాయని, శిక్షణ తీసుకుని ఆ నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన స్కిల్స్ హబ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. జనశిక్షణ సంస్థాన్ సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ పి.వరలక్ష్మి మాట్లాడుతూ వృత్తి విద్యాకోర్సులను నేర్చుకున్న యువతకు బ్యాంకులు నుంచి సబ్సిడీతో రుణాలను మంజూరు చేస్తున్నాయన్నారు. యువత వాటిని సద్వినియోగం చేసుకుని మరికొంతమందికి ఉపాధి కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణార్థులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలతో ప్రమాదకరంగా గుంతలు



ధర్మవరప్పాడుతండ శివారులో నీటితో ప్రమాదకరంగా మారిన క్వారీ గుంత

జగ్గయ్యపేట: మండలంలో అక్రమంగా గ్రావెల్ కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గుంతలు నీటితో నిండి చెరువుల్లా తలపిస్తున్నాయి. ముఖ్యంగా ధర్మవరప్పాడుతండ, రావిరాల, జయంతిపురం, రామచంద్రునిపేట, అన్నవరం, గండ్రాయి, అనుమంచిపల్లి, వేదాద్రి గ్రామాలలో ఎక్కువగా గ్రావెల్ క్వారీలున్నాయి. దీంతో రాత్రివేళల్లో కొందరు అక్రమార్కులు గ్రావెల్ తవ్వుతుండటంతోపాటు ప్రస్తుతం వర్షాకాలం కావటంతో గుంతల్లోకి వర్షపు నీరు చేరి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. సుమారు 10 నుంచి 20 అడుగుల మేర గుంతలు తవ్వుతుండగా, వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లోకి నీరు చేరుతోంది. దీంతో నీటి కోసం గుంతల్లోకి దిగిన జీవాలకు లోతు తెలియకపోవడంతో అందులోపడి మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల ధర్మవరప్పాడుతండాలో గొర్రెలు గుంతల్లోకి దిగడంతో సకాలంలో స్పందించి 10 గొర్రెలను బయటకు తీసుకువచ్చారు. ఈ ప్రాంతంలోనే కర్మాగారాలు ఉన్నందు, కార్మికులు కూడా ఒక్కోసారి తెలియక అటుగా వెళ్లి గుంతల్లో పడి ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ గ్రావెల్ తవ్వకాలు సాగకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వంటావార్పుతో కార్మికుల నిరసన



వంటావార్పు కార్యక్రమంతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

నందిగామరూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించటంతో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు, సీఐటీయూ నాయకులు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట వంటావార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మెకు కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మద్దతు పలికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కర్రి వెంకటేశ్వరరావు, వర్కర్స్ యూనియన్ నాయకులు పరిమి రవి, తానూరి శ్రావణ్‌కుమార్, దారెల్లి అశోక్ కుమార్, కండెల శ్రీను, మార్కపూడి దాసు, బ్రహ్మం, బాల్, ఆనంద్ ఇందూరి, ప్రమీల, బేబీ తదితరులు పాల్గొన్నారు.

ఈసారి 'ఏరు కంటే ఏకాశే ముందు'



చుక్కనీరు లేని మునేరు

వత్సవాయి: 'ఏరు ముందా ఏకాశి ముందా' అనే నానుడిని నిజం చేస్తూ నాలుగైదేళ్లుగా ఏటా ఏకాశి పండగకంటే ముందుగానే మునేటికి వరద వచ్చేది. కానీ ప్రస్తుతం జూలై నెల సగం కావస్తున్నా.. ఏకాదశి దాటిపోయినా ఇంతవరకు సరైన వర్షం పడలేదు. మునేరుకు వరద కూడా రాలేదు. దీంతో ఏరు కంటే ముందే ఏకాశి పండగ వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఎప్పుడూ ఏకాశి పండగ కంటే ముందు వచ్చే ఏరు ఈ సారి కనిపించకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇప్పుడే ఇట్లా ఉంటే ఖరీఫ్ సీజన్ ముందుకు సాగేదెలా? అని డైలమాలో ఉన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా మునేరు బోసిపోయంది. ఏటిలో చుక్క నీరు లేకుండా లేదు. ఏటా ఈ సమయానికి మునేటికి వరదవచ్చి కాలువకు కూడా నీరు రావడంతో రైతులు వరినారును పెంచుకునేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు కనపడకపోవడంతో వరి పంట ఆలస్యమవుతాయని రైతులు చెబుతున్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

నందిగామరూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతోపాటు విద్యాభివృద్ధి తమసంఘం విశేషంగా కృషి చేస్తున్నట్లు యుటీఎఫ్ మండల అధ్యక్షుడు బెనర్జీ పేర్కొన్నారు. మండలంలోని చెరువుకొమ్ముపాలెం, పెద్దవరం, అడవిరావులపాడు, లింగాలపాడు, ఐతవరం తదితర గ్రామాలలో మంగళవారం సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిత్యం పోరాడే యుటీఎఫ్‌కు ఉపాధ్యాయులు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిన్నం నరసింహారావు, బొద్దుకోలు రమణయ్య, కుంచం లక్ష్మీనారాయణ, బండారు రామారావు, పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలని ఆదేశం

వీరులపాడు: గ్రామాల్లో వీఆర్వోలు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రవికుమార్ ఆదేశించారు. జుజ్జూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన మండలంలోని వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు రెవెన్యూ రికార్డుల్లో వివరాలను సక్రమంగా నమోదు చేయాలన్నారు. అంతే కాకుండా రైతుల వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ గోడౌన్ తనిఖీ

జగ్గయ్యపేట: పట్టణంలోని కోదాడ రోడ్డులోని సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను విజయవాడ సివిల్ సప్లై కార్పొరేషన్ జోనల్ మేనేజర్ శివపార్వతీ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడి స్టాకు వివరాలను తెలుసుకున్నారు. ప్రతినెలా సకాలంలో ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లోని రేషన్ దుకాణాలు, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు బియ్యాన్ని సరఫరా చేయాలని ఆదేశించారు. వసతి గృహాలకు ప్రభుత్వ సన్నబియ్యాన్ని అందించాల సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్ మంజుశ్రీ పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd. జగ్గయ్యపేట బ్రాంచి [illegible]

జగ్గయ్యపేట
తేది 15-07-2025 [illegible]

రాయపూడి శ్రీనివాసరావు
అడ్వకేట్ & నోటరీ, సెల్: 98484 12920